తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుచానూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :

తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాల గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణతో ప్రారంభమైనది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలలో భాగంగా సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, వాస్తు పూజ, తదితర క్రతువులు నిర్వహించారు. అనంతరం సేనాధిపతిని అమ్మవారి ఉద్యానవనంకు వేంచేపు చేసి శాస్త్రోక్తంగా పుట్టమన్ను సేకరించారు. అనంతరం సేనాధిపతి విశ్వక్సేనులతో తిరుమాడ వీధులలో ఊరేగించి ఆలయంలోని హోమగుండం ప్రక్కన పాలికలో సేకరించిన పుట్టమన్ను వేయడంతో అంకురార్పణం వైదిక కార్యక్రమాలు ప్రారంభం అయినది. ఆలయంలో సంవత్సరం పొడవునా పలు క్రతువుల్లో తెలియక జరిగిన దోషాల నివారణకు ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం సాంప్రదాయం. ఈ ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు శ్రీనివాస చార్యులు, మణికంఠ ఆచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేశ్, ప్రసాద్ టెంపుల్ ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## కమనీయం 'వరసిద్ధుని' కళ్యాణం

### -పులకించిన భక్తజనం





కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

కాణిపాకం బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు స్వామివారి తిరుకళ్యాణం నిర్వహించడానికి తల్లిదండ్రులైన శివపార్వతులు పగలు కాణిపాకం గ్రామ పురవీధుల్లో భిక్షాటన చేశారు. ఈసందర్భంగా అలంకృతులైన శివపార్వతులు మణికంఠేశ్వరాలయంలో అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం కాణిపాకం, కాకర్లవారిపల్లె గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ తమ పుత్రుడు వరసిద్ధుని తిరుకళ్యాణానికి భిక్షాటన చేశారు. అనంతరం రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, దేదీప్యమానంగా అలంకరించిన కళ్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి, సమేత గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే నూతన వధూవరులైన సిద్ధి, బుద్ధి గణనాధులకు పుణ్యాహావాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం గావించి స్వామివారికి పాదపూజ చేశారు. అనంతరం అశేష భక్తజనం నడుమ స్వామివారిచే ఉభయదేవేరులకు మాంగల్యధారణ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈతిరుకళ్యాణాన్ని తిలకించిన అశేష భక్తజనం భక్తి పారవశ్యంతో పరవశించిపోయారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# గడువుకు ముందే 'స్థానిక' సమరం

### ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఎలక్షన్ కమీషన్ లేఖ




చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికలను గడువు కంటే 3 నెలల ముందు నిర్వహించి పూర్తి చేయాలని ఎలక్షన్ కమీషన్ నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఎలక్షన్ కమీషన్ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు లేఖ రాయడంతో ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అనుమానంతో వున్న కొంతమందికి క్లారిటీ లభించినట్లైంది. రాష్ట్రంలో 2026 ఏప్రిల్ 3 నాటికి రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవికాలం ముగియనుంది. అంటే ఎలక్షన్ కమీషన్ ఏప్రిల్ 3 నాటికి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి ఏప్రిల్ 4 నాటికి కొత్తగా ఎన్నికైన వారితో పదవి ప్రమాణ స్వీకారం చేయించాలని నిర్ణయించి ఈ మేరకు చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఎలక్షన్ కమీషనర్ నిర్ధేశించిన షెడ్యూల్ మేరకు రాష్ట్రంలో అక్టోబర్ 15వ తేదీలోపు వార్డుల విభజన పూర్తి చేయాలి. అలాగే నవంబర్ 30వ తేదీలోపు పోలింగ్ కేంద్రాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి డిసెంబర్ 15లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఇవన్ని పక్కాగా పూర్తి చేసిన అనంతరం జనవరి నెలలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల పోలింగ్ ఆపై ఫలితాలు ప్రకటించాలి. రాష్ట్రంలో ఏడాది క్రితమే సార్వత్రిక ఎన్నికలు జరిగిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటై ఇంకా ఏడాదిన్నర కాలం సైతం పూర్తి కాలేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను షెడ్యూల్ మేరకు నిర్వహించకుండా కొంత జాప్యం చేస్తోందని ఇటు అధికార పార్టీలో ఇప్పటికే పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండగా మరోవైపు అటు ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సైతం కొంతమంది నాయకులు ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగవని ధీమా వ్యక్తం చేస్తుండేవారు. కొంత మంది అధికారులు సైతం ఈ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే అవకాశం వుండదని, పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్, మున్సిపాల్టీలకు పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమించి అధికారులతో కొంతకాలం పాటు పరిపాలన సాగిస్తారని భావిస్తుండేవారు. అయితే ఎలక్షన్ కమీషన్ మాత్రం స్థానిక సంస్థలకు గడువుకు ముందే ఎన్నికలు నిర్వహించి పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ పాలకవర్గాలకు గడువు పూర్తయిన వెంటనే కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించి నిర్ధేశించిన సమయం కంటే మూడు నెలలకు ముందే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల నిర్వహించి పూర్తి చేయడానికి పక్కాగా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఎలక్షన్ కమీషన్ రాష్ట్ర ప్రభుత్వానికి తన ఉద్దేశంను స్పష్టం చేస్తూ లేఖ రాసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలక్షన్ కమీషన్ రాసిన లేఖకు ఎలాంటి స్పందన వుంటుందనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం స్థానిక సంస్థల ఎన్నికలను వాటి కాలపరిమితి ముగియక ముందే ఎన్నికలు నిర్వహించి వాటికి నూతన పాలకవర్గాలు ఏర్పాటు చేయాలని భావిస్తే ఎలక్షన్ కమీషన్ రాసిన లేఖకు సత్వరం స్పందించి రాష్ట్ర ప్రభుత్వం సత్వరం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి సంసిద్ధం అవుతుంది. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ఇప్పట్లో చేపట్టకుండా ఎలక్షన్ కమీషన్‌కు ఎదో ఒక కారణం చూపుతూ లేఖ రాసే అవకాశాలు వున్నాయి. ఎలక్షన్ కమీషన్ నిర్ధేశించిన మేరకు గడువు కంటే 3 నెలలకు ముందే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా! లేదా! ఎలక్షన్ కమీషన్ లేఖపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయంపై సర్వత్రా ప్రస్తుతం చర్చ జరుగుతుంది.

# పందులు బాబోయ్...పందులు...!

### శ్రీవారి అవెన్యూ కాలనీలో స్వైరవిహారం, - ఇండ్లలోకి పరుగులు....కంపుతో తిరగలేకపోతున్న స్థానికులు విష జ్వరాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్న చిన్నారులు - ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



శ్రీవారి అవెన్యూ కాలనీలో సంచరిస్తున్న పందులు



తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త ః

తిరుచానూరు పంచాయతీ ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి సమీపంలోని ఆటోనగర్ పక్కనే ఉన్న శ్రీవారి అవెన్యూ కాలనీలో వందల సంఖ్యలో పందులు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. అంతే కాకుండా అవి రాత్రి పగలు అని తేడా లేకుండా ఇండ్లలోకి పరుగులు తీస్తున్నాయి. ఆ కంపుతో స్థానిక ప్రజలు, మహిళలు, చిన్నారులు వీధుల్లో తిరగలేని దయనీయ పరిస్థితి. ఇంటి ముందు కాసేపు స్వేద తీరదామన్నా పందులు స్వైరవిహారం చేస్తూ చిన్నారులపై దాడులకు తెగబడుతున్నాయి. కాలనీ చుట్టుప్రక్కలలోని బురద గుంటల్లో మునుగుతూ తేలుతూ ఆ బురదతో వీధుల్లో సంచరిస్తుండడంతో స్థానికుల అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. వీటి వల్ల పిల్లలు విష జ్వరాలకు గురై ఆస్పత్రులు పాలవుతున్నారు. పిల్లలు మెదడువాపు వ్యాధికి గురయ్యే ప్రమాదముందని డాక్టర్లు కూడా సూచిస్తున్నారు. కానీ పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఎక్కడో ఊరు బయట తిరుపతి, తిరుచానూరు మధ్యలో ఇలా పందులు యజమానులు పందులను పెంచుకోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట పందులు యజమానులకు స్థానికులు గోడును చెప్పుకున్నా, బ్రతిమాలినా వారు పట్టించుకోక పోవడంతో తిరుచానూరు పంచాయితీ అధికారులకు, పోలీసులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా, వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని కాలనీ వాసులువాపోతున్నారు. దీనిపై తిరుచానూరు పంచాయితీ ఇఓ, తిరుచానూరు పోలీసులు, ఉన్నతఅధికారులు వెంటనే స్పందించి పందులను కాలనీకి దూరంగా మేపుకునే విధంగా చూడాలని స్థానికులు వేడుకుంటున్నారు.



కాలనీ నడిబొడ్డున యజమాని పందులకు మేపువేస్తున్న దృశ్యం

### సోమవారం లోపు పందులు ఎక్కడా కనపడకూడదు

#### - కనిపిస్తే కేసులు నమోదు చేస్తాం : ఇఓ మణి

శ్రీవారి అవెన్యూ కాలనీలో పందులు స్వైరవిహారం చేయడంపై తిరుచానూరు పంచాయితీ ఈవో మణిని ప్రభాతవార్త ప్రతినిధి వివరణ కోరగా ఆయన స్పందించారు. సోమవారం లోపు పందుల ఎక్కడా కనపడకూడదని, ఉంటే యజమానులు కేసులు నమోదు చేస్తామన్నారు. పందులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లాలని యజమానులకు సూచించారు. ఒక వేళ కనపడిన వాటి యజమానులపై చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే దాదాపు పది మందికి పందుల యజమానులకు పంచాయితీ ద్వారా నోటీసులు జారీ చేశామన్నారు. శ్రీవారి అవెన్యూ కాలనీలతో పాటు దామినేడు ఇందిరమ్మ ఇండ్లు, కొండ కాలువ, లక్ష్మీ నగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో కూడా పందులు ఎక్కడైనా కనిపించినా పందులు యజమానులపై కేసులు నమోదు చేసి జైళ్ళకు పంపడం ఖాయమని తెలిపారు. పందులు యజమానులు గుర్తించుకోవాలన్నారు.

## చెవిరెడ్డి ఇంట్లో సిట్ అధికారుల సోదాలు

### రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు



తిరుపతిరూరల్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొని, రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంట్లో సిట్ అధికారుల బృందం సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి సిట్ అధికారుల బృందం దాదాపు 20మంది తుమ్మలగుంటలో ఉన్న చెవిరెడ్డి ఇంట్లో సోదాలు చేస్తున్నారు. మధ్యాహ్నం వరకు చెవిరెడ్డి కుటుంబ సభ్యులు, తనయులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలను మౌఖికంగా ప్రశించినట్లు సమాచారం. అనంతరం రికార్ట్స్ పరిశీలించి, వ్యాపార లావాదేవీలకు సంబందించి రికార్ట్స్ పరిశీలించి, కొన్ని రికార్డ్సును స్వాధినం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిన్న చెవిరెడ్డి కంపెనీలలో సోదాలు నిర్వహించి, తుమ్మలగుంటలో కూడా సోదాలు నిర్వహించటానికి రాగా కుటుంబ సభ్యులు ఇంట్లో లేనందున సిట్ అధికారులు వెనుతిరిగిన విషయం తెల్సిందే. మద్యం కుంభకోణం కేసులో 38వ ముద్దాయిగా 79రోజులుగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం తెల్సిందే.

**ఆరు కంపెనీల రికార్డ్స్ స్వాధీనం చేసుకున్నాం: సిట్ అధికారి**

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చెందిన ఆరు రకాల కంపెనీలకు సంబంధించిన రికార్డ్సును స్వాధీనం చేసుకుని సిట్ కార్యాలయానికి పంపుతామని సిట్ అధికారి తెలిపారు. తిరిగి ఎప్పుడు విచారణ చేస్తామనేది ఇంకా తెలియరాలేదన్నారు.

## షిరిడీలో గుత్తివారిపల్లెకి చెందిన వ్యక్తి మృతి

రేణిగుంట సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

వాగ్గుత్తి వారి గ్రామానికి చెందిన ఎం. ముని రాజారెడ్డి (49) గురువారం మహారాష్ట్రలోని షిరిడి లో మృతి చెందాడు. గుత్తివారిపల్లె గ్రామం నుండి పదిమంది సాయిబాబా భక్తులు సాయినాధుని దర్శనం కోసం సోమవారం షిరిడి బయలుదేరారు. అప్పటికి గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలి ఉంది. బయలు దేరే సమయంలో ముని రాజారెడ్డి కొంత నలతగా ఉన్నాడు. తోటి భక్తులు అతనిని రావద్దని కోరారు. టిక్కెట్టు రిజర్వేషన్ చేసు కోవడంతో తప్పని పరిస్థితుల్లో బయలుదేరారు. బయలుదేరింది మొదలు విరేచనాలు మొదలయ్యాయి. షిరిడీలో తీవ్ర అస్వస్థతకు గురై అక్కడి మృతి చెందాడు. భక్తులు అతని భౌతికకాయాన్ని తీసుకొస్తున్నట్లు తెలుసుకున్న శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి గ్రామానికి చేరుకుని మండల అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా పంచాయితీ అధికారిణి సుశీల దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాల కృష్ణ నాయక్ గుత్తి వారి పల్లెలో ఎంపీడీవో ప్రభురావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డితో తీసుకోవలసిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. భక్తుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.




## రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తాం

### - రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్

### - అట్టహాసంగా రెస్కో పాలకవర్గం ప్రమాణ స్వీకారం!!



కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో రైతుల అభ్యున్నతే లక్ష్యంగా తాము పనిచేస్తామని కుప్పం రెస్కో ఛైర్మన్ వి.జి.ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం రెస్కో పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంను స్థానిక బస్టాండులో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు హాజరు కాగా వారి సమక్షంలో రెస్కో ఎం.డి. సోమశేఖర్ రెస్కోఛైర్మన్‌గా ప్రతాప్‌కుమార్, వైస్‌ఛైర్మన్‌గా విశ్వనాథ్‌తో పాటు సభ్యులుగా మరో 13మంది చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సంస్థ పురోగతికై పనిచేస్తామన్నారు. రెస్కో లైసెన్స్‌కు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అన్ని విధాలా సహకరించిన టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అ ంతకుముందు రెస్కో డైరెక్టర్లుగా ఆర్ముగం, శివ, తులసినాథ్, మురళి, హారోగరన్, అనసూయ, బసవరాజు, శరణ్‌కుమార్, మునివెంకటప్ప, బాలగంగాధర్, అమీర్ బాషా, విజయ్ కుమార్, సతీష్‌లు ప్రమాణసీ ్వకారం చేశారు. అనంతరం స్థానిక నేతలు పాలకవర్గాన్ని ఘనంగా సత్కరించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీష్‌నాయుడు, మున్సిపల్, మండలపార్టీఅధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విశ్వనాథ నాయుడు, బాబు, ఆనందరెడ్డి, జనసేన నరేష్, నాలుగు మండలాలనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక వెళ్ళిరా!



తిరుపతికార్పొరేషన్, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:

తిరుపతి నగరంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను తొమ్మిదవరోజు గురువారం సాయంత్రం నుండి నిమజ్జనాలకు తరలించారు. అటు వినాయకమహోత్సవ కమిటీ, ఇటు పోలీసు, నగరపాలకయంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. వినాయకసాగర్‌కు చేరుకున్న విగ్రహాలను వరుసక్రమంలో ,ప్రశాంతంగా నిమజ్జనాలు చేసేలా వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గుండాల గోపీనాధరెడ్డి, ఆదం అనిల్, మల్లకుప్పం శేఖర్, మల్లారపు రవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావులు పూర్తిసహాయసహకారాలందించారు. అలిపిరి సిఐ రామకిశోర్ నేతృత్వంలో గురువారం రాత్రి వరకు వందవిగ్రహాలు నిమజ్జనం చేశారు.

## అశ్వవాహనంపై గణపయ్య

కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాధుడు అశ్వవాహనంపై అధిరోహించి కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. రాత్రి ఆలయంలో అంగరంగ వైభవంగా తిరుకళ్యాణం జరిగిన అనంతరం స్వామివారికి అశ్వవాహనసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజవంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులచే ఉదయం స్వామివారికి అష్టోత్తర శతకలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్లు సర్వాలంకృతులై అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన అశ్వవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



# శానిటేషన్‌పై కమీషనర్లు పక్కాగా పర్యవేక్షణ - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: మున్సిపాల్టీల్లో శానిటేషన్ పనితీరుపై క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కమీషనర్లు పర్యవేక్షణ కలిగి వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని ఐదు మున్సిపాల్టీల్లోని శానిటేషన్ పనితీరు, విద్యుత్ దీపాలు, రెవెన్యూ వసూళ్ళు, మంచినీటి సరఫరా తదితరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, పుంగనూరు మున్సిపాల్టీలు వున్నాయని, ఇక్కడ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కమీషనర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపాల్టీలకు



శానిటేషన్, విద్యుత్ దీపాలంకరణ కోసం పలమనేరు, పుంగనూరు మున్సిపాల్టీలకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే మున్సిపాల్టీల్లో చెత్త సేకరణ ఎలా జరుగుతుంది! వీధి లైట్ల పరిస్థితి ఏంటీ! ప్రస్తుతం ఎన్ని వీధి లైట్లు వున్నాయి! ఎన్ని లైట్లను మరమ్మత్తు చేయాలి! ప్రస్తుతం ఎన్ని వీధి దీపాలు కొనుగోలు చేశారు! ఎన్ని వీధి లైట్లను అమర్చడం జరిగింది! వార్డుల వారీగా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే తడి, పొడిచెత్తను తరలించడానికి అవసరమైన చోట్ల త్రోపుడు బండ్లు, ట్రాక్టర్లు, పుషర్ట్ ట్రాలీలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారా! లేదా! అని పరిశీలించాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీలను సందర్శించి వారికి మంచినీరు సరఫరా అవుతుందా! పరిశీలించి సురక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధంకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, పుంగనూరు కమీషనర్ మధుసూధన్‌రెడ్డి, పలమనేరు కమీషనర్ ఎన్వీ రమణారెడ్డి, నగరి కమీషనర్‌కృష్ణారెడ్డి, కుప్పంకమీషనర్‌శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## ఎపి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వుయ్యాల శ్రీనివాస్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఎపి ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిత్తూరు నగరానికి చెందిన జనసేన నేత వుయ్యాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన కార్యకర్తగా తాను మొదటి నుండి తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వెంట నడిచానని, రాష్ట్ర జనసేన ఐటి విభాగంలో పని చేస్తున్న తనను గుర్తించి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, జనసేన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## భారత్‌లో ఆధునిక యూరాలజీ చికిత్సలు వేగంగా విస్తరణ



చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: భారతదేశంలో ఆధునిక యూరాలజీ కొత్త చికిత్స విధానాలు వేగంగా విస్తరిస్తున్నాయని మైసూరు అపోలో ఆసుపత్రికి చెందిన ప్రసిద్ధ యూరాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ మణియార్ రాఘవేంద్ర అన్నారు. చిత్తూరు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(ఎఐఎంఎస్‌ఆర్)లో గురు వారం డిస్టింగ్విష్డ్ గెస్ట్ లెక్చర్లో యూరాలజీ రంగంలో తాజా పరిణామాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన వ్యక్తగా హాజరైన డాక్టర్ మణియార్ రాఘవేంద్ర యూరాలజీ విభాగంలో తాజా పురోగతులు అనే అంశంపై ప్రేరణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. యూరాలజీ విభాగంలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, పిక్ సర్జరీలు, రోబోటిక్ టెక్నా లజీ వినియోగంపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎంఎస్‌ఆర్ అసోసియేట్ డీన్ రమ్యా రామకృష్ణన్, జనరల్ సర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ రామకృష్ణ, ప్రొఫెసర్ ఓ.సిద్ధార్ధ్, ప్రొఫెసర్ శివచంద్రరాజు, ప్యాకల్టీసభ్యులు,వైద్యవిద్యార్ధులు, నర్సింగ్ విద్యార్ధులు, హెల్త్‌కేర్ ప్రొపెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై కేసు నమోదు - డీఎస్పీ పార్ధసారథి



కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త హంద్రీ-నీవా కాలువల్లో కృష్ణాజలాలు నిలిపేశారని సోషియల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ పార్ధసారథి తెలిపారు. ఈనెల 30న సిఎం చంద్రబాబునాయుడు జలహారతి నిర్వహించిన రోజు మాత్రమే నీటిని విడుదలచేసి ఆపై నీరు నిలిపేశారని సిఎం చంద్రబాబునాయుడు ఫోటోతో మార్ఫింగ్ చేసిన వీడియో, ఫోటోతో అసత్య ప్రచారాలు చేసారన్నారు. అసత్య వార్తలు ప్రచారం చేసిన రామ్‌అలియాస్ వైఎస్‌జె-45అనే వ్యక్తితో పాటు వైఎస్సార్సీ సోషియల్ మీడియా ఎక్స్ ప్లాట్‌ఫామ్, ఓ దినపత్రికపై కుప్పం, రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్లలో సెక్షన్ 196(1)ఎ, 336(3)(4), 340(2),353(2), భారత న్యాయసంహిత 67 ఆఫ్ ఐటి యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తూ సోషియల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచురిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఇక నెలరోజులూ నిత్యావసరాల పంపిణీ

కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇకపైప్రభుత్వ చౌక దుకాణాల్లో నెలరోజుల పాటు నిత్యావసర సరుకులను డీలర్లు పంపిణీ చేస్తారని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకా ంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మూడో సచివాలయం పరిధిలో నూతన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పౌరసరఫరాల శాఖలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా చేసేందుకు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ స్మార్ట్ కార్డులను అందుబాటులో తెచ్చారన్నారు. కార్డులో ఎలాంటి రాజకీయ నేతల ఫోటోలు ఉండవన్నారు. ప్రజలకు కూడా ఈ కార్డు సౌలభ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రామకుప్పం అధ్యక్షుడు ఆనందరెడ్డి, కౌన్సిలర్లు సోమశేఖర్, జిమ్‌దాము, జాకీర్, సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కో ఇన్‌చార్జ్ తిరుమగళ్, జనసేన నరేష్ పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామాలయ పునర్నిర్మాణంకు భూమిపూజ

శాంతిపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామా లయం పునర్నిర్మాణ పనులను గురువారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు 7.88 కోట్ల నిధులను ఆలయ అభివృద్ధికి మంజూరు చేశారన్నారు. రాళ్లబూదుగూరును పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పది ప్రధాన ఆలయాలు, గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, నాగరాజు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, గంగమ్మగుడి ఛైర్మన్ బిఎం కె రవిచంద్ర, రెస్కో డైరెక్టర్ బసవ రాజు, మణి, గిరిధర్, పెద్దన్న, ఆంజనేయరెడ్డి, శ్యామల, హరినాథరెడ్డి, జయరాజ్, కుమార్, మురళి పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తవణంపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బెంగళూరు తిరుపతి సిక్స్ లైన్ రోడ్డు తెల్లగుండ్లపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లగుండ్లపల్లికి చెందిన బి శేఖర్ బాబు (54) అనే వ్యక్తి సొంత పనుల నిమిత్తం ఐరాల క్రాస్ రోడ్డుకు వచ్చి తిరిగి సిక్స్ లేన్ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న గా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీనితో శేఖర్ బాబు అక్కడక్కడ మృతి చెందాడు. స్థానికులు కనుగొని బంధువులకు సమాచారం అందించారు. మృతుడు స్థానికంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేట్ గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

## తెదేపా సీనాయర్ నాయకులు రామస్వామి మృతి..ఎమ్మెల్యే సంతాపం.



పెద్దపంజాణి,సెప్టెంబర్ ప్రభాతవార్త: మండలంలోని బెరబల్లి గ్రామానికి చెందిన తెదేపా పంచాయతీ పార్టీ అధ్యక్షుడు రామస్వామి మృతి చెందారు.ఈయన పెద్దపంజాణిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి గ్రామానికి చేరుకుని రామస్వామి మృతదేహంపై పార్టీ జండాకప్పి ఘననివాళులర్పించారు.ఆయన పార్టీకి చేసినసేవలు మరువలేనివని ఆయనలోటు తీరనిదని పేర్కొన్నారు.కుటుంబీకులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ధైర్యమిచ్చారు.కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష ఆనంద్,కార్యదర్శి చలపతి నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి,మురహరిరెడ్డి,సుధాకర్ రెడ్డి,క్రిష్ణారెడ్డి,శ్రీరాములు,నాగరాజు,రెడ్డి,మురళిపాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్దేశకులు.

పెద్దపంజాణి,సెప్టెంబర్ ప్రభాతవార్త: ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాణంలో నిర్దేశకులని హెచ్‌ఎం బాబురెడ్డి పేర్కొన్నా రు.గురువారం స్థానిక మండలపరిషత్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో ఎంతో



కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.పిల్లలకు తల్లిదండ్రుల తరువాత గురువు ఎంతో కీలకమని పేర్కొన్నారు.మట్టి ముద్దలను సైతం మానిక్యాలుగా తీర్చే గొప్పశిల్పులు ఉపాధ్యాయులని ఉపాధ్యాయులపై సమాజంలో ఎంతో గురుతర బాధ్యతఉందని పేర్కొన్నారు.సేవాభావంతో ఉపాధ్యాయులు పిల్లల్ని ఆదర్శతంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు,ఇందిరా, తేజోవతి,ఫహిమున్నిషా,కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టల్లో ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీలు.

పెద్దపంజాణి,సెప్టెంబర్ ప్రభాతవార్త: మండలంలోని రాయలపేటలోని ప్రభుత్వ సాంఘికసంక్షేమ బాలికల హాస్టలును గురువారం ఎంపిడిఓ బాలాజి ఆకస్మిక తనిఖీ చేశారు.రోజూ తాజా కూరగాయలను విధ్యార్ధులకు వండిపెట్టాలని హాస్టల్‌లోపల పరిశరాలు శుబ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచిం చారు. భోజన్నాన్ని సైతం నాణ్యతతో అందించాలని పేర్కొన్నారు.హాస్టల్లో ఎలాంటి సమస్యలు తలెత్త కుండా చూడాలని ఇంచార్జ్ వార్డెన్ దీపకుమారిని ఆయన ఆదేశించారు.కార్యక్రమంలో రెడ్డిశేఖర్ మహిలా సంరక్షణ కార్యదర్శి సమీరా పాల్గొన్నారు.అంతకుముందు మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఓ పరిశీలించారు.కూలీలు చేపడుతున్న ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు.క్షేత్రస్థాయిలో మస్టర్ల నిర్వహణను సక్రమంగా ఫీల్డుఅసిస్టెంట్లు నిర్వహించాలని ఆయన ఆదేశించారు కార్యక్రమలో ఉపాది సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: పాట్నా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులతో పాటు చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరి ఆలయ ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ జారీ

తవణంపల్లె, సెప్టంబర్ 4 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి రాష్ట్ర దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ ఈఓ టి.హనుమంతరావు తెలిపారు.కమిటీలో 50 శాతం మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్ధులు ఈనెల 22 లోగా ధరఖాస్తు చేసుకోవాలని ఈఓ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నరకావస్తున్న ఇంత వరకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోచుకోలేద ు.ఎట్టకేలకుపాలకమండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ కావడంతో ఆశావహులు పోటీపడుతున్నారు.

## పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలి



సదుం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త వైఎస్‌ఆర్సీపి నాయకులు కార్యకర్తలు వైసిపి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని మాజీ మంత్రి పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం సదుంలో మండలం ఎర్రతివారిపల్లెలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన కార్యకర్తలు ని ఉద్దేశించి ప్రసింగిస్తూ కార్యకర్తలు, నాయకులు జరుగుతున్న పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పలు సూచనలు ఇచ్చి ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లి శాసన సభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి ,పార్టీ రాష్ట్ర పరిశీలకులు వజ్ర భాస్కర్ రెడ్డి, వైస్సార్సీపీ రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు సోమశేఖర్ రెడ్డి, మండల పార్టీ నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు మాజీ వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే



సదుం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త సమాజంలో నిర్దేశకులు ఉపాధ్యాయులే అని సదుం ఏఎస్ఐ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గురువుల యొక్క గొప్పతనాన్ని గురించి వారి బాధ్యతలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, లీగల్ టీ మెంబర్ గిరిబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణమ నాయుడు ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీ

గంగాధర నెల్లూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల భాగంగా గంగాధర నెల్లూరు మండలం మిట్ట కొత్తూరు గ్రామానికి చెందిన కృషణమ నాయుడు పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఎంపిక చేశారు. ఈ సంధ్బంగా గురువారం ఆయన ప్రమాణ స్వీకారానికి స్థానిక అల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీగా బాణాసంచా పేలుళ్ల చతుర్ చక్ర వాహనాల ర్యాలీతో పాటు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అట్టహాసంగా భారీ జన సందోహం మధ్య చిత్తూరుకి చేరుకొని చిత్తూరు గాంధీ విగ్రహం నందమూరి తారక రామరావు విగ్రహాలకు పుష్పమాల వేసి అనంతరం పెనుమూరుకు చేరుకొని చైర్మెన్‌గా కృష్ణమ నాయుడు వైస్ చైర్మెగా అరుణ నాదన్‌లతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మేల్యే థామస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రజన్ చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌లతో పాటు పలువురు హాజరై కార్యక్రమాన్ని బలోపేతం చేశారు.ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ పార్టీకి కష్టపడిన వాళ్ళన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి వారికి తగిన పదవులు అందిస్తుందన్నడానికి ఇదే నిదర్శనమని ఇంకా మిగిలి వున్న నామినేట్ పదవులను నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తామని ఎవరు నిరాశకు లోను కావద్దని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ జ్యోతిశ్వర్ రెడ్డి, రాంబాబు రెడ్డి పురుషోత్తం నాయుడు జగదీశ్వర్ నాయుడు మాధవ నాయుడు దేవసుందరం గోపి శ్రీధర్ యాదవ్ ముని రాజులు యాదవ్ జ్యోతి యాదవ్ ప్రకాష్ నాయుడులతో పాటు పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

- నేడు జడ్పీ సమావేశభవనంలో గురుపూజోత్సవం

చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 70 మంది ఉపాధ్యాయులను శుక్రవారం గురుపూజోత్సవం పురస్కరించుకుని కలెక్టర్ సుమిత్‌కుమార్ సత్కరించనున్నారు. జడ్పీ సమావేశభవనంలో శుక్రవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగనుంది. ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో పాటు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 70 మంది టీచర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ సన్మానించనున్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా నౌషద్ ఆలీ

గుడిపాల, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



నరహరిపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ నందు భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నౌషద్ ఆలీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. రాష్ట్ర రాజధాని తాడేపల్లిలో శుక్రవారం జరుగనున్న రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలోసిఎంనారాచంద్రబాబునాయుడు చేతుల మీదుగా నౌషద్ ఆలీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకో నున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన నౌషద్ ఆలీని మండల విద్యాశాఖ అధికారిగణపతి, జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ దుర్వాసులు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు

## కాణిపాకంలో నేడు (శుక్రవారం)

సాయంత్రం : ధ్వజావరోహణం

ఉభయదారులు: దేవస్థానం వారిచే.

సాయంత్రం : అభిషేకం, వడాయత్తు ఉత్సవం

ఉభయదారులు : కీ॥శే॥ శ్రీ గాలి ఉమాపతి నాయుడు, కాకర్లవారిపల్లె.

రాత్రి : ఏకాంతసేవ

ఉభయదారులు: కీ॥శే॥శ్రీ.కె.సోమశేఖరరెడ్డి వారి జ్ఞాపకార్థం వారి కుమారులు, కాణిపాకం.

ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఎ శారదా కొత్రా వారిచే ప్రవచనము, 11 గంటల లనుండి 12 వరకు ఇ.వి.ఆకాష్ కృష్ణ చిత్తూరు, 12 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మస్తాన్‌బాబు, తిరుపతి, 1 గంటల నుండి 2 గంటల వరకు సి.జాహ్నవి, రాజమహేంద్రవరం, 2 గంటల నుండి 3 గంటల వరకు ఎస్.హర్షిణి, హైదరాబాద్ వారిచే భక్తి_రంజని, 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సుమతి భాగవతారిణి వారిచే హరికథ, సాయంత్రం 5 గంటల నుండి 5.30 గంటల వరకు కె.రమ్య, హైదరాబాద్, 6 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు 7 గంటల నుండి 7.30 గంటల వరకు వి.వేద, శ్రీకాళహస్తి, 7.30 గంటల నుండి 8 గంటల వరకు నవ్య దీపిక, బెంగుళూరు, 8 గంటల నుండి 9 గంటల వరకు జతీష్, నృత్యాలయ వారిచే కూచిపూడి, భరతనాట్యం, 9 గంటల నుండి 11 గంటల వరకు వి.జేజయ్య, శ్రీహర్ష నృత్య కళాక్షేత్రం, 11 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు వెంకట శేషయ్య, శ్రీసత్యసాయి నాట్యమండలి చెముడుగుంట, వెంకటాచలం వారిచే నాటకములు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జనం జనం భక్తజనం...!

-కోలాహలంగా విఘ్ననాయకుడి నిమజ్జనం



చౌడేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త మండల వ్యాప్తంగా గత 9రోజులుగా భక్తులచే పూజలందుకొన్న లంబోధరుడి నిమజ్జనాన్ని కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని నేతాజీనగర్, పాతబస్టాండు, రామస్వామిగుడివీధి, బత్తలాపురంరోడ్డు, తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనం గావించారు. నేతాజీనగర్, రామస్వామి, పాతబస్టాండు యువత ఆధ్వర్యంలో సాంప్రదాయ నృత్యాలు, డప్పులు, జక్కీకలు, కోలాటలు, డిజే పాటలతో ఉర్రూతలూగుతూ వినాయక విగ్రహాల నిమజ్జనాలు వేడుకగా నిర్వహించారు. ఆయ మండలపాల వద్ద అన్నదాన శిబిరం ఏర్పాటు చేసారు.

## విషసర్పం కాటేయడంతో వ్యక్తికి అస్వస్థత



చౌడేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త విషసర్పం కాటేయడంతో వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. మండలంలోని వెంగళపల్లి పంచాయతీ గాజులవారిపల్లికి చెందిన వెంకట్రమణ పొలం పనులు చేసుకొంటుండగా విషసర్పం కాటేసింది. అపస్మారకస్థితి పదున్న అతన్ని స్థానికులు ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## ఘనంగా టౌన్‌బ్యాంకు పాలకవర్గం ప్రమాణస్వీకారం

- పార్టీ కోసం నిజాయితీగా కష్టపడేవారికి తప్పక గుర్తింపు

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



చిత్తూరురూరల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: పార్టీ కోసం నిజాయితీగా కష్టపడే వారిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పకుండా గుర్తించి తగిన బాధ్యతలు అప్పగిస్తారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. గురువారం టౌన్‌బ్యాంక్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పిసిఆర్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి భారీ ర్యాలీగా జిల్లా పరిషత్ సమావేశ మందిరం చేరుకొని చిత్తూరు కోఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జీ కమిటీ చైర్మెన్‌గా కాంద్ర రమేష్‌నాయుడు, డైరెక్టర్లుగా సురేష్, నర్సింహులు, అన్సర్‌లు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు అభివృద్ధి కోసమే ప్రజలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించారని, పదవుల విషయంలోనూ కూటమి పార్టీల అభిప్రాయాలు తీసుకొని కేటాయించడం జరుగుతుందన్నారు. వంద ఏళ్ల చరిత్ర కలిగిన టౌన్‌బ్యాంక్ ద్వారా ప్రజలకు ఉత్తమమైన సేవలందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌నాయుడు మాట్లాడుతూ నీతినిజాయితీతో చిత్తూరు కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకును అభివృద్దిపథంలో నడిపిస్తానని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. రీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజులు, తెదేపా నాయకులు చంద్రప్రకాష్, వెంకటేష్‌యాదవ్, జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, నరేష్, ఈశ్వర్, మోహన్‌రెడ్డి, రాజేశ్వరి, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, జనసేననాయకులు ఆరణి కవిత, క్లస్టర్, డివిజన్, మండల ఇన్‌ఛార్జీలు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శబరిమలయాత్ర



పలమనేరు టౌన్ 4, ప్రభాతవార్త: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం శబరిమల యాత్ర బయలు దేరారు. 45 రోజులు పాటు భక్తి శ్రద్ధలతో అయ్యప్పమాల ధరించి దీక్షలో వున్న ఆయన పలమనేరు శివాలయంలో పూజలు చేసి అర్చకుల ఆశీర్వాదాలు పొందారు. 110 మంది వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఇరుముడులతో రెండు బస్సుల్లో ఆయన యాత్ర బయలుదేరారు. శబరిమలైలో అయ్యప్ప స్వామికి ఇరుముడులు సమర్పించి అనంతరం తిరిగి పలమనేరు చేరుకుంటారు.

## హమాలీలకు ప్రత్యేక వైద్యశిబిరం

పలమనేరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:



సివిల్‌సప్లై శాఖలో పనిచేసే హమాలీలకు గురువారం స్థానిక సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డా.సురేఖ అధ్వర్యంలో షుగర్, బిపి, హెచ్‌విఐ, మలేరియా, డెంగ్యూలకు పూర్తిగా పరీక్షలు చేశారు. ఇందుకు కావాల్సిన మందులు అందజేసి పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక చేయాలని పరసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత శుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులుసబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, దీనివల్ల ఎటువంటి సమస్యలు ఉండవని సబ్ యూనిట్ అధికారి జయశంకర్ సూచించారు. స్టాఫ్ నర్స్ భారతి, ఫార్మాసిస్టు నిరుపమ, ల్యాబ్ టెక్నీషియన్ దీప తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు బంకులపై ఫిర్యాదు చేయవచ్చు

పలమనేరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:

పెట్రోలు బంకుల్లో జరిగే అవకతవకలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర పబ్లిక్ రిలేషన్ కార్యదర్శి డి.సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెట్రోలు బంకుల్లో తాగునీరు లేక పోయినా, వాహనాలకు గాలి సౌకర్యం లేక పోయినా, టాయలెట్లు వాడకునే అవకాశం లేక పోయినా, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ మందులు లేక పోయినా, పెట్రోలు, డీజల్ కల్తీ జరిగినా, కొలతలు తేడావున్నా, పెట్రోలు బంకుల్లో పని చేసే సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా, యజమానిపై లేదా సిబ్బందిపై ఆయా పెట్రోలు బంకుల సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు, ఇండియన్ ఆయిల్ ఫోన్ నెంబర్ 1800233355కు, భారత్ పెట్రోలియమ్ 1800224344, హెచ్‌సిఎల్ 18002333555, రిలయన్స్ 18008919023కు ఫిర్యాదు చేయవచ్చు. ప్రజలు కల్తీకి దూరంగా అవనీతి అంతం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు.

## ఎస్సీ ఎస్టీ పథకాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి

పుంగనూరు సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



ఎస్సీ ఎస్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్దామని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణా వత్ మునీంద్ర నాయక్ అన్నారు. పుంగనూరు మండల ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశం మండల తాసిల్దార్ కార్యాలయంలో జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వము అందిస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో తీసుకుని వెళ్లాలని ఇంద్ర నాయక్ కోరారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ప్రివెన్షన్ ఆక్ట్ పైన అవగాహన సదస్సుల ద్వారా తెలపాలని పోలీస్ డిపార్ట్మెంట్ ను కోరారు. జిల్లా కలెక్టర్ మరియు గిరిజన సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో గిరిజన గురుకుల పాఠశాల బాలికలకు ఐదు ఎకరాలు స్థలం కేటాయించడానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞత తెలిపారు. ఎస్సీ ఎస్టీ మహిళలు మరియు బాలికలు పైన అత్యాచారాలకు పాల్పడిన వారి పైన ఫోక్సో చట్టం అమలు చేయాలని కోరారు.జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ సమ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్, తాసిల్దార్ రాము, ఎస్సై హరిప్రసాద్, సర్వేయర్ శ్రీనివాసులు నాయక్ వివిధ డిపార్ట్మెంట్ అధికారులు మరియు ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు నాగే నాయక్, చిన్న రాయుడు, రాజా, అశోక్, శ్రీనివాసులు, చిన్నప్ప, నరసింహులు, ఆయుబ్ ఖాన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## హమాలీలకు ప్రత్యేక వైద్య శిబిరం



సదుం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త మండల పరిదిలోని నడిగడ్డ గ్రామంలో ఉన్న సివిల్ సప్లైస్ డిపార్ట్మెంట్ గౌడౌన్ నందు పనిచేయుచున్న హమాలీలకు చెరుకువారిపల్లె పీహెచ్సీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరము నిర్వహించారు. ఈ సందర్బంగా డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో హమాలీలకు షుగర్, బిపి, హెచ్ బి టెస్ట్, మలేరియా, డెంగీ, కంప్లీట్ బ్లడ్ టెస్టు పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు పంపిణీ చేశారు. అనంతరం వారికి పౌష్టికాహార ఆవశ్యకతను, క్రమం తప్పక వ్యాయామము అలాగే ఇంటి చుట్టుప్రక్కల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిచారు. అదేవిదంగా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే వ్యక్తిగత శుభ్రతను పాటించాలని చెప్పారు. తప్పనిసరిగా భోజనానికి ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది నీలకంఠ , శిఖామణి, జానకి, ఎం ఎల్ హెచ్ పిలు మనీషా,రషీద్‌ఏఎన్ఎంసుజాత,ఆశాకార్యకర్తలు శ్యామల, పార్వతి, రమాదేవి, భారతి పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ బిజెపి మండల అధ్యక్షుడు ఎం ప్రసాద్



పూతలపట్టు సెప్టెంబర్ 4, ప్రభాతవార్త పూతలపట్టు మండలంలో పూతలపట గ్రామంలో యుండు ఎం ప్రసాద్ గత ఏడు సంవత్సరాలుగా ఎల్ఐసి ఏజెంట్గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం చిత్తూర్ జిల్లా ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఎల్ఐసి తరపున 20 జనవరి 2025 నిర్వహించిన మ్యాడ్ డే రోజున 24 గంటలలో ఎక్కువ పాలసీలు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో పేరు సంపాదించుకొని ఎల్ఐసి వారి తరపున ఘనంగా సత్కరించి ప్రశాంసా పత్రం అందజేసారు. అందులో బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్, డెవలప్మెంట్ ఆఫీసర్ బి వేణుగోపాల్ రెడ్డి పాల్గొని ప్రశంస పత్రం పూతలపట్టు బిజెపి మండల అధ్యక్షుడు ఎం ప్రసాద్‌కు ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు.

# అట్టహాసంగా సింగిల్ విండో చైర్మన్ ప్రమాణ స్వీకారం...

## తిరుపతి డివిజన్

రేణిగుంట సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



అర్హులైన పేద ప్రజలందరికీ మూడు సెంట్లు ఇంటి స్థలాలు సంవత్సరంలోగా ఇస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. సింగిల్ విండో చైర్మన్ గా అగ్రహారం భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లుగా నీలకంఠారెడ్డి, గజేంద్ర చేత కోపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి పురుషోత్తం ప్రమాణస్వీకారాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో చేయించారు. చైర్మన్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు నీలకంఠారెడ్డి, గజేంద్రలు పదవులు రావడానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కోఆపరేటివ్ బ్యాంకును అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల శ్రమను గుర్తించే పార్టీగా టిడిపిని అభివర్ణించారు. 30 సంవత్సరాలు సుదీర్ఘమైన సేవలు అందించిన భాస్కర్ రెడ్డి, నీలకంఠారెడ్డి, గజేంద్రలకు బాధ్యతాయుతమైన పదవులు కట్టబెట్టామన్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసుడిగా ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో ఎమ్మెల్యే అయ్యాను తప్ప దోచుకోవడానికి కాదన్నారు. రేణిగుంట ప్రజలకు శాశ్వతంగా దాహార్తిని తీర్చడానికి సమ్మర్ స్టోరేజ్ ప్లాంట్ ని ఏర్పాటు చేస్తామన్నారు. సింగిల్ విండో కార్యాలయం కోసం సొంత భవనం నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజల ఇంటి స్థలాల పేరుతో పాల్పడిన భూ ఆక్రమణలను మొదటి ఫేసు నందు హైడ్రా తరహాలో చర్యలు తీసుకున్నామని, రెండో ఫేస్ కార్యరూపం దాల్చడానికి సిద్ధంగా ఉందని భూ ఆక్రమణలకు పాల్పడిన వారిని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో

**అర్హులందరికీ మూడు సెంట్లు ఇంటి స్థలం : బొజ్జల సుధీర్ రెడ్డి..**

మాట్లాడుతూ గుత్తివారిపల్లెలో ప్రబలిన డయేరియాని ప్రభుత్వ వైఫల్యం అని విమర్శించిన వారికి శవ రాజకీయాలు చేస్తున్నారంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.కార్యక్రమంలో తుడా మాజీ చైర్మన్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణి గుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి జిల్లా రైతు సం ఘం నాయకుడు మునుస్వామి నాయుడు, టిడిపి సీనియర్ నాయ కులు కన్నన్ రెడ్డి, ఈ.మురళి, రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు దేవళ్ళ రమణ, రేణిగుంట మండల మాజీ ఎస్సీ సెల్ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, టిడిపి పట్టణ అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, రేణిగుంట మండల బిజెపి ఉపాధ్యక్షుడు రాజారాయల్, తూకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ డాక్టర్ మర్దాల రవిబాబు,పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్.



10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం

రేణిగుంట సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ జయచంద్ర నేతృత్వంలో పోలీసులు చాకచక్యంగా వలపన్ని సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ద్విచక్ర వాహనాల దొంగను గురువారం ఉదయం మండలంలోని వెదళ్ళ చెరువు విన్నారీ సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద వివిధ ప్రాంతాల్లో తస్కరించిన సుమారు 5,70,000 రూపాయల విలువైన 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు కథనం మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాలెం దళిత వాడుకు చెందిన దొడ్ల సంతోష్ (43) చిత్తూరు, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలలో మోటర్ సైకిల్ దొంగతనాలు చేసేవాడు. ఇతనిపై మూడు జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నందు ఐదు కేసులు నమోదు కావడంతో రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్సై నాగరాజు, ట్రైనీ ఎస్సై స్వాతి, కానిస్టేబుళ్లు రాజశేఖర్, బారుషా, గౌరీ నాయుడు, శీను బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిని విమానాశ్రయం కి వెళ్లే విన్నారీ సర్కిల్ వద్ద అదుపు తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టి నిందితుని వద్ద 10 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. నిందితుని రిమాండ్ కు తరలించే నిమిత్తం అర్బన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిందితుడు సంతోష్ రైళ్లలో తిరుగుతూ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను గుర్తించేవాడన్నారు. ఆ తరువాత చాలా తెలివిగా ద్విచక్ర వాహనాలను దొంగలించి గ్రామాల్లో అమాయకులైన రైతులకు అమ్మేవాడని చెప్పారు. ఈ కేసులో అపారమైన ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు బారుషా, రాజశేఖర్లకు రివార్డులు ఇస్తున్నామన్నారు. వీరికి ప్రత్యేక రివార్డుల కోసం ఎస్పీకి నివేదికలు పంపుతామన్నారు. విలేకరుల సమావేశంలో రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, అర్బన్ ఎస్సై నాగరాజు, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, అర్బన్ ట్రైనీ ఎస్సై స్వాతి, గాజులమండ్యం ట్రైన్ ఎస్సై ప్రవల్లిక, ఏర్పేడు ట్రైన్ ఎస్సై లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## టైలర్స్ కాలనీలో బడి గుడి ఏర్పాటు చేయండి:

తొట్టంబేడు,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని టైలర్స్‌కు ఆది నుంచి తమ కుటుంబం అండగా ఉంటుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం తొట్టంబేడు మండల పరిధిలోని టైలర్స్ కాలనీలో శాసనసభ్యునిచే పట్టణంలోని టైలర్స్‌కు లైఫ్ ఇన్సురెన్సు కార్డులను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు అందజేసారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి టైలర్స్ అసోసియేషన్‌కు చెందిన పోలూరు శ్రీనివాసులు రెడ్డి దిశ దేశ నిర్దేశం చేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసన సభ్యుడుగా పట్టణంలోని వందమందికి పైగా ఉన్న టైలర్స్‌కు ఇంటి స్థలాలు అందించారని వివరించారు. కాలనీలో టైలర్స్ పిల్లలు చదువుకొనుటకు బడి, ఆధ్యాత్మికవాదుల గడపటానికి గుడిని నిర్మించి ఇవ్వాలని ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ బాలయ్య,అమర్‌నాథ్,ప్రతాప్‌రెడ్డి, మురుగేశం,రాము,మణి,చెంగయ్య, మౌలాలి, జాకీర్,రేవతి,మాధవి, ద్వారా సుధీర్‌రెడ్డి దంపతులను సత్కరించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్‌నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు,సుమతి,మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న బిఎల్‌వర్మ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను గురువారం కేంద్ర మినిస్టర్ ఫర్ కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండ్ సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్ కుటుంబసభ్యులతోజరిపించుకున్నారు.ఆయన కుటుంబసభ్యులతో రాగా దక్షిణగోపురం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో వేదపండితులతో ఎఇఓ మోహన్ ఎపిఆర్ఓ రవి,,పర్యవేక్షకులు నాగభూషనం యాదవ్ వేదపండితులతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## విద్యాలయాల హబ్‌గా శ్రీకాళహస్తిని తీర్చిదిద్దిన సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాన్ని విద్యాలయాల హబ్‌గా తీర్చి దిద్దటంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి బాధ్యతా యుతంగా వ్యవహరించారని తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్.యు ఉమేష్‌రావు వారి సహచరులు ఎంఎల్‌ఏను సత్కరించారు. గురువారం వారు స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పున:ప్రారంభించటంలో ఎంఎల్ఏ ఉన్నత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌పై వత్తిడి తెచ్చి అనుమతి సాధించారన్నారు.గోపాలకృష్ణారెడ్డి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తన మానస పుత్రికగా తీర్చి దిద్దితే వైకాపా హయాంలో దానిని నిర్జీవం చేసారన్నారు. దానికి పునరుజ్జీవనం కల్పించటంలో ఎంఎల్ఏ పడ్డ శ్రమ ప్రసంశనీయం అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ఉన్నత విద్యామండళ్ళ హబ్‌గా తీర్చి దిద్దటంలో బొజ్జల కుటుంబానికి వారే సాటి అన్నారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో ఉమేష్‌రావుతో పాటు డాక్టర్ దశరాధాచ్చారి, మిన్నల్‌రవి, రంగినేనిచెంచయ్యనాయుడు, లక్కమనేని మధుబాబు, పేట బాలాజిరెడ్డి, మునిరాజాయాదవ్, గాజుల భరత్‌లు పాల్గొన్నారు.

## ఉత్తమ సమాజ నిర్మాతలు గురువులు

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగట్ల సౌజన్యంతో ప్రధానోపాధ్యాయురాలు జయకుమార్ అధ్యక్షతన గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జయకుమారి విద్యార్థులకు వివరిస్తూ ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాతలన్నారు. మట్టి ముద్దలను సైతం మాణిక్యాలుగా తీర్చి దిద్దేశక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి ఘనంగా పూజలు నిర్వహిం చారు.ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, ప్రకాశం రాజు,చెంగల్ రాయులు, అంజనీప్రసాద్,రమీజ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీఫెస్టివ్ షాపింగ్‌కు శక్తినిచ్చే గ్రాండ్ షాప్సీ మేళా.

తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త:

భారత్ రాబోయే పండుగ సీజన్‌కు సిద్ధమవుతుండగా, షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ అంతా అత్యంతగా ఎదురు చూస్తున్న షాపింగ్ వేడుక, సంవత్సరంలో అతిపెద్ద అమ్మకం అయిన గ్రాండ్ షాప్సీ మేళా (జీఎస్ఎం)ను తిరిగి తీసుకువస్తోంది. ఆగస్టు 29 నుండి సెప్టెంబర్ 7 వరకు షెడ్యూల్ చేయబడిన ఈ కార్య క్రమం ఖిపసే గిరెంగే డ్యామ్, షాపింగ్ హోగి సుబా షామ్‌ఖి అనే థీమ్‌తో సాటిలేని ఉత్సాహాన్ని ఇస్తుంది అని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లోని షాప్సీ, ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ బిజినెస్ హెడ్ కపిల్ తిరానీ ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో, గ్రాండ్ షాప్సీ మేళా భారత్‌కు విలువ ఆధారిత షాపింగ్‌కు కీలకమైనదిగా ఉండ నుంది. విస్తృతమైన ఎంపికతో సాటిలేని సరసతను కలపడానికి రూపొందించబడిన జీఎస్ఎం, ఆయా కుటుం బాలు రాజీ లేకుండా వేడుక చేసుకోవడానికి సహాయపడుతుంది. అదే సమయంలో 2, 3 మరియు 4 శ్రేణి పట్ట ణాలలో మిలియన్ల మంది కొత్త కస్టమర్లను చేరుకోవడానికి విక్రేతలకు శక్తివంతమైన వేదికను ఇస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుడే కీలకం

పుత్తూరు, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :



సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుడు ప్రముఖ పాత్ర పోషిస్తాడని, విద్యార్థి జీవితానికి ఉపాధ్యాయుడు మార్గదర్శకుడని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. సెప్టెంబరు 5వ తేదీన మిలాదున్ నబీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు ఇవ్వడంతో గురువారం స్థానిక డిగ్రీ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజైన సెప్టెంబరు 5న దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు ఎన్నో త్యాగాలు చేస్తారన్నారు. విద్యార్థులు కూడా గురువులు చెప్పినట్టు విని క్రమశిక్షణ, సేవాభావం అలవరుచుకుని బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తర్వాత కళాశాల అధ్యాపకులంతా శాలువా, పూలమాలలతో ప్రిన్సిపల్ చంద్రమౌళిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, అధ్యాపకులు డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, డాక్టర్ కె.శ్రీదేవి, డాక్టర్ పి.సుజన, డాక్టర్ సి.వెంకటకృష్ణయ్య, డాక్టర్ ఎ.దేవకి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రంలో అంగరంగవైభవంగా వినాయక నిమజ్జనం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గురువారం వినాయక నిమజ్జనం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.గత బుధవారం వినాయక చవితి సందర్భంగా పట్టణంలో సుమారు 200చోట్ల వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసారు. ఏడు రోజుల పాటు పూజలు జరిపిన వినాయకులను ఆదివారం సాయంత్రం నుంచి నిమజ్జనానికి తరలించారు. ఈ ఏడాది కూడా సమీపంలోని తెలుగుగంగ కాలువలో నిమజ్జనం కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పలు చోట్ల వినాయ విగ్రహాలను మూడవ రోజు నిమజ్జనం జరిపారు. ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్‌తోపాటు మాజీ మున్సిపల్ చైర్మెన్ ముత్యాల పార్థసారధి, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, డివైయస్‌పి నరసింహారావు,టౌన్ సిఐ డి.గోపి, కూటమి నాయకులు నాగమల్లి దుర్గా ప్రసాద్, వజ్రం కిషోర్,రామిశెట్టి సాయి, ఢిల్లి,రాజు, రెడ్డి మురళి, బిజెపి నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు వేడాం కృష్ణయ్య, తిరుమల శెట్టి నరేష్, వెంకటేష్, పల్లమనాయుడు, యాదవ్, కూనాటి నాగరాజు పాల్గొన్నారు.

## నేడు క్రెడాయ్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో



తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త:

తిరుపతిలో నేటి నుంచి మూడు రోజులపాటు కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయి) ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కన్వెషన్ హాల్ నందు 5,6,7, తేదీలలో మూడు రోజులపాటు ప్రాపర్టీ షోను తిరుపతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ చైర్మన్ కే.గోపినాథ్,ప్రెసిడెంట్ ఎం.రాంప్రసాద్ పిలుపునిచ్చారు.గురువారం తిరుమల బైపాస్ రోడ్డులోని క్రెడాయి కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాపర్టీ షోలో ఓపెన్ ప్లాట్స్,అపార్ట్ మెంట్స్,విల్లాస్,స్టీల్,సిమెంట్ మెటీరియల్స్, పెయింటింగ్స్,ఫర్నిచర్స్ హోమ్ లోన్ సంబంధించిన ప్రముఖ బ్యాంకులు,ఆటో మొబైల్స్ ఇతర కంపెనీలు అనేక స్టాల్స్ లో పాల్గొంటారని తెలియజేశారు.ప్రజలు ఇక్కడ అప్రూవల్ తో కూడిన అన్ని ఇల్లు లేదా ప్రాపర్టీస్ ను చూడవచ్చని కొనుగోలు చేయొచ్చు అని ఇల్లు లేదా ప్రాపర్టీలను కొనుగోలుదలచిన వారు తప్పనిసరిగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు వైస్ ప్రెసిడెంట్ రాజేష్ బాబు,సెక్రటరీ పి.నరసింహారెడ్డి,ట్రెజరర్ హరికృష్ణ సభ్యులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



ఎస్వీయూలో గురువారం ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు విచ్చేసి ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందారని పొందారని అన్నారు. అబ్దుల్ కలాం ఉపాధ్యాయుడిని క్యాండిల్ వెలుగుతో పోల్చారని, తాను కరగుతున్నా వెలుగునిచ్చేది గురువని వారు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు.యస్వీయూలో సాంకేతికత బాగా వృద్ధి చెందిందని,కృత్రిమ మేధస్సు,క్వాంటమ్ టెక్నాలజీతో అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ గురువులు నిత్య విద్యాదాతలని, గురువును దేవుడిగా మనం భావిస్తామని అన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా మనం మారాలని,యస్వీయూలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలని తెలిపారు.యస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి మాట్లాడుతూ అలెగ్జాండర్ తన తల్లి, గురువు నుండి అనేక విషయాలను నేర్చుకున్నానని చెప్పిన విషయాన్ని గుర్తుచేసారు.ఈ సందర్భంగా 2024 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఓవిఎస్ రెడ్డి,కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ ఆచార్య వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చెంబేడు కాలువ సిల్టు తొలగింపుకు శ్రీకారం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని చెత్తా చెదారం,వ్యర్థాలు మురుగునీటి కాలువల ద్వారా చెంబేడు కాలువలో చేరి అధ్వాన్నంగా మారింది. ఈ సమస్యను గుర్తించిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శివం టు శివం పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌తో చర్చించారు. ఈ రోడ్డు పక్కనే చెంబేడు కాలువ ప్రవహిస్తుంది. ఒక నాడు పంట కాలువగా ఉన్న కాలువ నేడు శ్రీకాళహస్తి పట్టణంలోని మురుగునీరు తరలింపు కాలువగా మారింది. దాంతో పట్టణంలోని వ్యర్థాలన్ని ఈ కాలువలోకి చేరుతున్నాయి. ఈ నేపధ్యంలో స్వచ్ఛ కాళహస్తిలో భాగంగా ఎంఎల్ఏ పరిశుభ్రతకు అధికారులతో చర్చించారు. కానీ నిధుల సమస్యను అధికారులుఎంఎల్ఏ దృష్టికి తీసుకు రాగా ఆయన శివం టు శివం రోడ్డు పనులు చేస్తున్న వారితో చర్చించారు. కాలువలో సుమారు ఒకటిన్నర మీటర్ వరకు వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటిని దసరా లోపల శుభ్రం చేయటానికి సూచించారు. ఇందుకు సుమారు రూ.20లక్షలు అవుతుందని అంచనాలు వేసారు. దాంతో కాలువ శుభ్రతను హిటాచిలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాలకు గురువారం శ్రీకారం చుట్టారు.సిల్టు తొలగింపుతో చెంబేడు కాలువ పూర్వ వైభవం రావాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్,పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, చెంచయ్యనాయుడు, కంఠారమేష్,షాకీర్ అలి,షఫీ,నెమళ్ళూరు బుజ్జి, ఖాదర్‌బాషా, అస్మత్,అస్లం,జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ అండర్‌టేకింగ్ చైర్మెన్ పూజలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్ చైర్మెన్,ఆముదాల వలస శాసనసభ్యుడు కూన రవికుమార్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు.వారికి దక్షిణ గోపురం వద్ద ఎఇఓ మోహన్ సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. రవికుమార్ ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలు,తీర్థ ప్రసాదాలు అందించారు.

## మాజీ ఎంఎల్ఏ పరామర్శ

తొట్టంబేడు,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లికి చెందిన వైకాపా నాయకుడు కొప్పుల చిన్నకృష్ణయ్య సతీమణి కొప్పుల ప్రమీలమ్మ హఠాన్మరణంగా మృతి చెందారు. గురువారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఉమ్మడి చిత్తూరుజిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు పార్థీవ దేహానికి నివాళులర్పించారు.వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కోగిలి సుబ్రమణ్యం, కొప్పుల మురళీ,కొప్పుల రత్నశేఖర్, రమేష్, రాజేంద్ర,కొప్పుల రమణయ్య,కోగిలి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక పై అత్యాచార కేసులలో నిందితుడు అరెస్టు

వెదురుకుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



ఓ మైనర్ బాలిక పై అత్యాచార కేసులో నింధితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన్నట్లు కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ హనుమంతప్ప గురువారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణపల్లె హరిజనవాడకు చెందిన ఓ మైనర్ విద్యార్థి జిల్లాపరిషత్ ఉన్న పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నది. కాగా బుధవారం పాఠశాలకు వెళ్ళడంకు రోడ్డు నిలబడి ఉండగా ఆదే గ్రామంకు చెందిన ప్రసాద్(40) తన ద్విచక్ర వాహనం పై వస్తుండగా పాఠశాల వద్ద వదిలి పెట్టమని చెప్పాడంతో స్కూటర్ పై ఎక్కించుకుని వస్తూ మార్గం మధ్యలో ఓ మామిడి తోటకు తీసుకెళ్ళి అత్యాచార యత్నంకు పాల్పిడిన్నట్లు తెలిపారు. ఆదే స్కూటర్ పై విద్యార్ధిని పాఠశాల వద్ద వదలి వెళ్ళిన్నట్లు చెప్పారు. సమాచారంను విద్యార్ధిని టీచర్లకు చెప్పాడంతో వారు తల్లిదండ్రులకు చెప్పాడంతో వారు ఫిర్యాదు చేసిన్నట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు చెప్పారు. కాగా నింధితుడు ప్రసాద్‌ను గురువారం బ్రాహ్మణపల్లె పరిసర ప్రాంతంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచడం జరిగింది. సీజే నింధితుడికి రిమాండ్ ఆదేశించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, కానిస్టేబుల్స్‌గంగయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహ నిమజ్జనం

కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని సామగుట్టపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని గురువారం రాత్రి గ్రామస్తులు ఘనంగా నిమజ్జనం చేశారు.స్వామివారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు.ఈ సందర్భంగా స్వామివారి లడ్డు ప్రసాదాన్ని వేలం నిర్వహించారు.అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామస్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## సర్పంచ్ కుర్చీ దొంగలు ఎత్తుకెళ్లారు !

రేణిగుంట సెప్టెంబర్ 4ప్రభాతవార్త



రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేశం కుర్చీని గురువారం దొంగలు ఎత్తుకెళ్లారనే వార్త గుప్పుమంది. పంచాయతీ కార్యాలయంలో తన చాంబర్ కు వచ్చిన సర్పంచ్ కుర్చీ కనబడకపోవడంతో ఎవరు తీసుకెళ్లారన్నట్టు అయోమయంలో పడ్డారు. కుర్చీ ఏమైంది చెప్మా అంటూ రూమంతా చూశారు. ఎక్కడ కనిపించలేదు. ఎవరో దొంగలు ఎత్తుకు వెళ్ళుంటారంటూ ఆయన సన్నిహితులు సందేహం వ్యక్తపరిచినట్టు సమాచారం. తీరా చూస్తే సదరు కుర్చీ కార్యదర్శి రూము నందు కార్యదర్శి కూర్చునే చోట సాక్షాత్కరించింది. పదవీకాలం పూర్తి కాకముందే కుర్చీ లాగేసుకున్నారు అంటూ పంచాయతీ కార్యాలయంలో గుసగుసలు వినిపించాయి.

## చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన కోలా ఆనంద్.

రేణిగుంట సెప్టెంబర్4ప్రభాతవార్త



రేణిగుంట మండలం గుత్తి వారి పల్లె గ్రామం నందు డయేరియా బారిన పడి శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న బాధితులను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్ గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులను వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. బాధితులకు బిజెపి పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని శ్రీ బాలాజీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ సాయి కార్తీక్, డాక్టర్ లహరి, జేఈవో నవీన్ కుమార్ రెడ్డి, హెచ్ఆర్ నాగరాజు లను కోరారు. అనంతరం బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు అందించారు. పరామర్శించిన వారిలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, రేణిగుంట మండల బిజెపి అధ్యక్షుడు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు నరేష్ రాయల్, బిజెపి యువనేత, ముదిరాజుల సంఘం జిల్లా కన్వీనర్ కుర్ర కాలవ వేణుగోపాల ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్ మధు జన్మదిన వేడుకలు

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



మల్లంగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మెన్ చెరుకూరి మధుశేఖర్ (సింగిల్ విండో చైర్మెన్) జన్మదిన వేడుకలు గురువారం మల్లంగుంట పిఏసిలో ఘనంగా నిర్వహించారు. మధుశేఖర్ జన్మదిన వేడుకలకు తిరుపతిరూరల్, చంద్రగిరి, రామచంద్రమండలాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధుశేఖర్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మధుశేఖర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మధ్యాహ్నం పార్టీ నాయకులు, కార్యకర్తలకు విందుభోజనం పెట్టారు. ఈ సందర్భంగా మధుశేఖర్ మీడియాతో మాట్లాడుతూ రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మల్లంగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి అర్హులైన రైతులకు ఋణాలు అందించి, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, రామచంద్రాపురం సింగిల్‌విండో చైర్మెన్ జనార్ధనచౌదరి, బి.సి.రాష్ట్ర నాయకులు నాగూరు శ్రీనివాసులు, తిరుచానూరు కిశోర్‌రెడ్డి, కత్తి సుధాకర్, ఈశ్వరయ్య,క్రిష్ణమూర్తిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అవిలాలసుధాకర్,సురేంద్రనాయుడు,లోకేష్ చౌదరి పాల్గొన్నారు.

## గురువే ప్రత్యక్ష దైవం

పాకాల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త



అన్ని వృత్తులలో కన్నా ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది అని పాకాల మండల విద్యా శాఖాధికారులు బాబ్జి, మరియు లింగయ్య అన్నారు. స్థానిక యన్‌వియన్ పాఠశాలలో గురువారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని అన్నారు. సమాజానికి మంచి మార్చగలిగే వారు ఒకే ఒక్క ఉపాధ్యాయులే లని పేర్కొన్నారు. నేటి బాలురనే రేపటి పౌరులుగా తీర్చిదిద్దే గలిగే వారే ఉపాధ్యాయులు అని అన్నారు. మన పాఠశాలలకు వచ్చే విద్యార్థులు పేద విద్యార్థులు కాబట్టి వారికి బాగా చదువు చెప్పాలని అన్నారు. సర్వే పల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అంచెలంచెలుగా ఎదిగి మన దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతిగా పని చేసారని పేర్కొన్నారు. అందుకే ఆయన పుట్టినరోజును టీచర్స్ డే గా సెప్టెంబర్ 5వ తేదీన ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది, సి.ఆర్.పి.లు పాల్గొన్నారు.

## అన్నదానం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు వద్ద జనసేన పార్టీ నాయకుడు పవన్‌కళ్యాణ్ ఆశయాల మేరకు డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. పేట బ్రదర్స్ సారధ్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వేలాది మందికి అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమాల్లో పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, గంధం శ్రీను, మణీ,నవీన్,కల్లిపూడి వెంకటేశ్, మునిచంద్ర, చందు,సాయి,యాసీన్‌బాషా, మునికుమార్, వీర మహిళలు బత్తెమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


**జాయింట్ ఛారిటీ కమిషనర్ - పూణె ప్రాంతం, పూణె**

Application No. 8/2025, U/s.36(1)(b) of MPT Act, 1950, Deccan Education Society, PTR No.F/167(Pune)

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా, గౌరవనీయులైన జాయింట్ ఛారిటీ కమిషనర్, పూణె వారు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తేదీ: 21.07.2025 దరఖాస్తు నెం.8/2025 లో సెక్షన్ 36(1)(బి) క్రింద షెడ్యూలులో వివరించిన స్థిరాస్తి డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ పి.టి.ఆర్.నెం.ఎఫ్/167 (పూణె) పూణె వారికి చెందినది. వారి హక్కు అనుభవంలో ఉన్న ఈ క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలాలో 6 ఎకరాలపై స్థిరాస్తిని సంవత్సరానికి ఒక్క రూపాయి (రూ.1/-) అద్దె చొప్పున 29 సంవత్సరాలకు లీజుకు దువ్వూరు యుగంధర్ ఛారిటబుల్ ట్రస్ట్ తిరుపతి వారికి ఇవ్వడానికి డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ, పూణె వారు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు.

కావున ప్రజలకు మరియు ఎవరికైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు ఉన్నట్లయితే ప్రజల నుండి వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా రాతపూర్వకంగా తమ అభ్యంతరాలను కింద పేర్కొన్న చిరునామాకు ఈ నోటీసు ప్రచురించబడిన 30 రోజులలోపు, జాయింట్ ఛారిటీ కమిషన్, పూణె ముందు తెలియజేయగలరు. ఒక వేళ ఎటువంటి ఆక్షేపణలు/ అభ్యంతరాలు అందకపోతే గౌరవనీయ అధికారి పైన పేర్కొన్న దరఖాస్తును విచారించి తగిన ఉత్తర్వులను ఇవ్వడం జరుగుతుంది.

**షెడ్యూలు:-**

స్థిరాస్తి వివరములు:- 0.53 ఆర్. అనగా 2144.83 చ.మీ. సర్వేనెం.293/3
5.47 ఆర్. అనగా 22136.03 చ.మీ. సర్వేనెం.293/4
6.00 ఎకరాలు అనగా 24281.13 చ.మీ.

పైన కనబరచిన స్థిరాస్తి వివరాలు, కుర్రకాల్వ గ్రామం, జీపాల్యం పంచాయతీ పాపానాయుడుపేట పోస్ట్, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నది. ఈ బహిరంగ ప్రకటన గౌరవనీయులైన జాయింట్ ఛారిటీ కమిషనరు ముద్రతో మరియు తేదీ: 28.08.2025న నా సంతకంతో జారీచేయబడింది.

**సూపరింటెండెంట్ ( JUDC ),**

పబ్లిక్ రిజిస్ట్రేషన్ ఆఫీస్, 45/2, లేట్ బి.ఎస్.ధోలేపాటిల్ రోడ్డు, పూణె-411001

# గూడూరు డివిజన్

## సూళ్లూరుపేట ఎఎంసి ఛైర్మన్‌గా ఆకుతోట



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు సంబం ధించి అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా సూళ్లూరుపేట పట్టణానికి చెందిన ఆకుతోట రమేష్ 15 మంది సభ్యులతో కలిసి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షునిగా ఓడూరు రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు డైరెక్టర్లుగా మిగతా వారు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిచేత వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి రావమ్మ ప్రమాణ స్వీకారం చేయించారు. మార్కెటింగ్ కమిటీలోని సభ్యులు, కూటమి నేతల సహకారంతో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మార్కెటింగ్ కమిటీని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలోని 3 ఎకరాల స్థలంలో మార్కెటింగ్ యార్డు నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. ఇందుకు సంబంధించి సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి స్థలాన్ని మంజూరు చేసే ప్రక్రియ చేపట్టారని ఆకుతోట రమేష్ వివరించారు. అలాగే ఈ నెల 7వ తేదీన కూటమి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కెఎస్ కల్యాణ మండపంలో అభినందన సభ జరుగుతుందని, ఈ సభకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్యులుగా హాజరవుతారని చెప్పారు.

## రోటరీ సేవలు అభినందనీయం



గూడూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవవార్త: రోటరీ క్లబ్ విద్య వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని పోలియో రహిత భారతదేశానికి రోటరీ క్లబ్ ఎంతో కృషి చేసిందని 22దేశాల్లో క్లబ్ సేవలు కొనసాగుతూ ఉన్నాయని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రవీంద్ర వెల్లడించారు. గూడూరు పట్టణంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రవీంద్ర పర్యటనలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. డి.ఆర్.డబ్ల్యూ కళాశాలలో రక్తదాన శిబిరం ,జడ్పీ బాలికల పాఠశాలలో ఫర్నిచర్ బహుకరణ, సాయిరాం వృద్ధాశ్రమంలో ఇన్వర్టర్‌ను డిస్టిక్ గవర్నర్ రవీంద్ర మరియు క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, ముని గిరీష్, బాలకృష్ణం రాజు, పివి కృష్ణయ్య, శ్రీధర్‌రెడ్డి, రాంప్రసాద్, వాసు గౌడ్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## జయంపులో ఉచిత క్యాన్సర్ పరీక్షలు



బాలాయపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం మండలంలోని జయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ లియోన పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ నెల 8న వడమాలపేట, పరమేశ్వర మంగళం, 11న కుప్పంబాదూరు, కమ్మపల్లి, 15న పాకాల, దామలచెరువు,18న దామినేడు, రేణిగుంట. 22న మంగళం, తారకరామానగర్ నిర్వహిస్తు న్నట్లు వివరించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, పద్మావతి,సర్పంచ్ సిద్ధయ్య, పంచాయతీ కార్యదర్శి లీలావతి, సూపర్వైజర్లు రాజేశ్వరి, అనూరాధ, ఎంఎల్ హెచ్ పి కల్యాణి, ఏఎన్ఎం కమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెందోడు హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఎంపిడిఓ



కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: మండలంలోని చెందోడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఓ దిలీప్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, ఉపాధ్యాయుల హాజరు పట్టికను నిశితంగా పరిశీలించారు. అసంపూర్తిగా మిగిలి పోయిన భవనాలను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి చెందోడులోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఉన్నారు.

## ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోటలోని ఎవికెఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు నిర్వహించారు. పలు ఆటల పోటీల్లో ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు గురుపూజోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ఎంఇఓ మస్తానయ్య తెలిపారు.

## పోలేరమ్మ జాతరకు మంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్యే



వెంకటగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఈనెల 10,11 తేదీల్లో జరిగే వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ జాతరకు రావాలని దేవాదాయశాఖమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఎమ్మెల్యే రామకృష్ణ ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రి ఆనంకు ఆహ్వాన పత్రికను, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జాతర వైభవంగా నిర్వహించాలని మంత్రి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణ, చరణ్, వేద పండితులు కమల్, శరత్ ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

## పంచాయతీలకు నిధుల కళ

### - 15వ ఆర్థిక సంఘం రెండో విడత జమ

కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: నిధులు లేక అత్యవసర పనులు చేపట్టలేక కటకటలాడుతున్న పంచాయతీలకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు ఈ నెల 3వ తేదీన విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ నిధులను పూర్తిగా పక్కదారి పట్టించిన విషయం తెలిసిందే. కూటమి సర్కార్ వచ్చాక పరిస్థితిని చక్కదిద్దింది. గ్రామాల అభివృద్ధికి శ్రీకారంచుట్టింది. కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను పంచాయతీలకు జమ చేసింది. ప్రాధాన్యత క్రమంలో పారిశుధ్యం, తాగునీరు, క్లాప్ మిత్రల వేతనాలతో పాటు అభివృద్ధి పనులకు గ్రామాల్లోని జనాభా ఆధారంగా విభజించుకుని నిధులు వినియోగించనున్నట్లు ఎంపిడిఓ దిలీప్‌కుమార్ చెప్పారు. నిధులు విడుదల కావడంతో వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

## 7వ రోజుకు ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మహిళా కండక్టర్ పద్మను అకారణంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గత కొన్ని రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 7వరోజు కొనసాగాయి. డిపో ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో సురేష్, షబ్బీర్‌బాషా, రమణయ్య, విజయభాస్కర్, పోలయ్య, సుబ్రహ్మ ణ్యం, రాధయ్య, కాలేషా, నాగరాజా, చైతన్య, ఎస్‌ఎంరెడ్డి పాల్గొనగా, డిపో సెక్రటరీ ఎం.శేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## రూ.10 కోట్లతోఅభివృద్ధి పనులు జడ్పీ సీఈఓ



వెంకటగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: 10 కోట్ల రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో వై మోహన్ రావు తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశం మేరకు వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయాన్ని సీఈఓ తనిఖీ చేశారు. 2024-25 సంవత్సరంగాను 10 కోట్ల రూపాయలు వచ్చినట్లు చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శులతో మోనిటరింగ్ చేస్తున్నట్లు చెప్పారు. తడి పొడి చెత్తలను వేరువేరుగా పంచాయతీ సిబ్బందికి గ్రామస్తులు అందించాలని తెలిపారు. ఇప్పటివరకు తడి పొడి చెత్తను కలిపిస్తున్నారని చెప్పారు. తడి పొడి చెత్తను వేరువేరుగా ఇచ్చేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి ఉన్నారు.

## ఆన్లైన్ ద్వారారుణాలు పొందవచ్చు



బాలాయపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: మండల సమాఖ్య కార్యాలయంలో సంస్థాగత శిక్షణ కార్యక్రమంలో భాగంగా వి.ఓ.ఏ.లకు ఆన్లైన్ మొబైల్ బుక్ కీపింగ్ పై వెలుగు ఎపిఎం వై.కిరణ్ శిక్షణ ఇచ్చారు.ప్రతి అంశాన్ని ఆన్లైన్‌లో ఈ యాప్ ద్వారా పొందుపరచాలని సూచించారు. రుణాలు తీసుకొన్నా, చెల్లించినా మెసేజ్లు రూపంలో సంఘ సభ్యులకు సమాచారం వర్తిస్తుందని సూచించారు.

## మనమిత్రపై అవగాహన కార్యక్రమం



వాకాడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి వాట్సప్ గవర్నర్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించవలెనని ఎంపీడీవో శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం మండల పరిషత్ కార్యాల యంలోని ఎంపీడీవో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి ఒక్క సర్వీస్ అయిన తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంనకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఎలాంటి సెలవులు మంజూరు చేయడం జరగదని, అంతేకాక అన్ని శాఖల పరిధిలోని అందరూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.

### నీట్ పరీక్షల్లో సీట్ సాధించిన...

## జననిని అభినందించిన ఎమ్మెల్యే



గూడూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఇటీవల విడుదల అయిన నీట్ పరీక్షల్లో 3200 ర్యాంక్‌తో నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి కళాశాల నందు మెడికల్ సీట్ సాధించిన బల్లవోలు గ్రామం దళిత కుటుంబానికి చెందిన ఇన్నమాల జనని ని ఆ గ్రామ నాయకులు దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయం నందు సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి ఈ రోజు మెడికల్ సీట్ సాధించిన జనని అందరూ స్ఫూర్తిగా తీసుకుని చదవాలని అన్నారు. జనని ఇంకా ఎన్నో ఉన్నత చదువులు చదివికుని జీవితంలో మంచి ఉద్యోగం సంపాదించి వారి తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

## ఆర్టీసి చిన్న స్థాయి ఉద్యోగుల పట్ల అన్యాయం : డిఎం



గూడూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: డిపోకు సంబంధించిన కండక్టర్ తిరుపతి నుంచి నెల్లూరు వెళ్లే బస్సులో విధులు నిర్వహిస్తుండగా తిరు పతిలో ముగ్గురు ప్యాసింజర్స్ ఎక్కగా దానిలో ముగ్గురు తాను ఇస్తానంటే నేను ఇస్తాను టికెట్కు అమోంట్ అని తెలియజేయగా ఆ బస్సు రద్దీలో బస్సు కండక్టర్ దగ్గర రెండు టికెట్లు తీసుకు న్నారు. హడావుడిలో తాను టికెట్ ఇచ్చాను అని అనుకున్నాను అని పి.శ్రావణ్ కుమార్ తెలియజేశారు. పాసింజర్ దగ్గర 90 రూపాయలు కలెక్ట్ చేశానని చెప్పి నామీద చెకింగ్ ఇన్స్పెక్టర్ తప్పుడు కేసు బనాయించారని వాపోయాడు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ శ్రీనివాసులు, ప్రసాద్, ట్రెజరర్ గౌస్ ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## లీలావతికి పదవి రావడం అభినందనీయం : ఎమ్మెల్యే



గూడూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి, అర్ధరాత్రి సమయంలో కూడా పార్టీ గెలుపుకి కృషి చేసిన గుండాల లీలావతికి ఆంధ్రప్రదేశ్ పశువుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా అవకాశం రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ధైర్యంగా పనిచేసే వ్యక్తి లీలావతి అని కొనియా డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చురుగ్గా పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చారన్నారు. లీలావతిని నమ్ముకున్న వారికి కూడా మంచి చేసే వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యేని కలిసి గురువారం కృతజ్ఞతలు తెలిపి, గజమాలతో సన్మానించి, సత్కరించారు. మహిళలకు పార్టీలో సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు.

## రైతుల సమస్యలు పట్టించుకోని కూటమి:కిలివేటి



నాయుడుపేట,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేచిందని సూళ్ళూరు పేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో యూరియా కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు యూరియా సరపరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మాజీసియం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9వతేదిన సూళ్ళూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడు తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి రాష్ట్రకార్యధర్శి కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి,మున్సి పాల్టి చేర్మేన్ కటకం దీపిక,వైసపి పట్టణ అధ్యక్షుడు,కలికి మాదవరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు ఓట్టూరు కిషోర్‌యాదవ్, కామిరెడ్డి రాజారెడ్డి, కటకం జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

4ఎన్‌పిటి01సమావేశంలో మాట్లడుతున్న కిలివేటి సంజీవయ్య

## బైక్ దొంగలు అరెస్టు!

నాయుడుపేట,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: నాయుడుపేట పట్టణంలో గతకొంత కాలం నుండి బైక్‌లు వరుస చోరీలకు గురౌతున్న విషయం తెలిసిందే. అయితే రాత్రి సమయంలో బైక్‌లు చోరీలకు పాల్పడు తున్న ముఠాలో నాగముంతల మణికంత, పెళ్ళకూరు శ్రావణకుమార్‌లను నాయుడుపేట పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద నుండి రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు.

## మంత్రిని కలిసిన పెళ్లకూరు టిడిపి నేతలు



పెళ్లకూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :అమరావతి లోని సచివాలయంలో గురువారం నాడు పెళ్లకూరు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీనేతలు తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. మండలంలో నెలకొన్న సమస్యలపట్ల మరియు ఇటీవల కాలంలో రెవెన్యూశాఖలో జరుగుతున్నటువంటి పరిణామా ల పట్ల రాతపూర్వకంగా వినతి పత్రం సమర్పించారు. అనంతరం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ చైర్మన్ మైలవరపు కృష్ణ తేజను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. మంత్రి గారిని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు,జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణ రెడ్డి,జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు శివకుమార్ మొదలియార్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర రెడ్డి, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు చైతన్య కృష్ణారెడ్డి, కారూరు గోపాల్ రెడ్డి మరియు నియోజకవర్గ వాణిజ్య విభాగం కార్యదర్శి కలవకోలు మునిష్ ఉన్నారు.

## రైతుల పక్షాన పోరాడుదాం : మాజీ మంత్రి రోజా



పుత్తూరు (నగరి), సెప్టెంబరు 4 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ, సహకారాలు అందక అల్లాడిపోతున్న రైతుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే వరకూ పోరాడాలని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. నగరి పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం పార్టీ నగరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె ప్రసంగించారు. అలాగే రైతులతో కూడా ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ జరిగేదని, ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలు నామమాత్రమై పోయాయన్నారు. రైతులు సరిహద్దుల్లోని తమిళనాడుకు వెళ్లి ఎరువులు కొనుక్కునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎంత నేల వున్నప్పటికీ ఒక పాస్ పుస్తకానికి ఒక బస్తా యూరియా ఇస్తామని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారన్నారు. వ్యవసాయం దండగ అని తన స్వీయచరిత్రలో రాసుకున్న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం రైతుల పాలిట శాపంగా మారిందని తెలిపారు. జగనన్న చేసిన పోరాటం వల్లే మిర్చి, పసుపు, పొగాకు, మామిడి రైతులకు న్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైకాపా శ్రేణులు పోరాడాలని, ఈ నెల 9వ తేదీన ఈ విషయమై ఆర్డిఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నగరి, పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్లు పి.జి.నీలమేఘం, ఎ.హరి, నగరి, పుత్తూరు, నిండ్ర ఎంపిపిలు భార్గవి, మునివేలు, దీప, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి తదితర పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ అధ్యాపకుడు విద్యార్థి జీవితాన్నే మారుస్తాడు

### - సంస్కృత వర్సిటీలో ముగిసిన అతర్జాతీయ సదస్సు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: సాంకేతికత ద్వారా విద్యావ్యవస్థ బలోపేతం మరియు శిక్షాక్షేత్రంలో నూతన సాంకేతిక విధానాలు ఆవిష్కరణలు అనే విషయంపై ముగిసిన మూడురోజుల అంతర్జాతీయ సదస్సు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎ.పి స్కిల్ డెవలెప్మెంట్ కార్పోరేషన్ భూతపూర్వ చైర్మన్ రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ డా.కె.లక్ష్మినారాయణ విచ్చేసి ఆధునిక కాలంలో విద్యావ్యవస్థలో టెక్నాలజీ అవసరతను వివరించి,దానితో పాటు గురువు యొక్క స్థానాన్ని గొప్పతనాన్ని ఉదాహరణలతో వివరించారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ కృత్రిమమేథ ఏవిధంగా ముందుకు వెళ్తుందో విద్యావ్యవస్థలో తెలియజేశారు.కానీ, ఉత్తమ అధ్యాపకుడు విద్యార్థి జీవితాన్నే గొప్పగా మారుస్తాడని, క్లాస్ రూమ్లో అధ్యాపకుడు మాత్రమే ప్రతివిద్యార్థి స్థితిని తెలుసుకుని దానికనుగుణంగా బోధిస్తాడని, యంత్రం ఆవిధంగా చెయ్యలేదని తెలియజేశారు.సంస్కృతం టెక్నాలజీలో ముందుస్థానంలో ఉందని వివరించారు. కేంద్రీయ సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.జి మురళీకృష్ణ మాట్లాడుతూ వైదిక సంస్కృతంలోనే సెల్ ఫోన్ టెక్నాలజీ దాగివుందని,సంస్కృతంలోని టెక్నాలజీ ఆధునిక భారతానికి అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ సంస్కృత వర్సిటీ బోపాల్ క్యాంపస్ అసోషియేట్ డైరెక్టర్ మరియు ఎడ్యుకేషన్ విభాగాధ్యక్షులు ప్రొ.గోవింద పాండే,నేపాల్ నుండి విచ్చేసిన డా.గజేంద్ర మని ధుంగణ, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్ల, రిజిస్ట్రార్ శ్రీ.కడియం వెంకట నారాయణరావు, కార్యక్రమ కన్వీనర్, ఫినాన్స్ ఆఫీసర్ ఇన్చార్జ్ ప్రొ.రాధా గోవింద త్రిపాఠి, ఎద్యుకేషన్ విభాగాధ్యక్షురాలు, సభా సంచాలకులు ప్రొ.కె.కాదాంబిని, కార్యక్రమ ఆయోజకులు ప్రొ.ఎ.సచ్చిదానంద మూర్తి, డా.ఎస్.వైష్ణవి, డా.ఎ.శేఖర్‌రెడ్డి, డా.కుమార్ బాగేవాడి మఠ్, డా.ఆలోక్ మండల్,డా.ఎ.చారుకేశ్, డా.జయంత్ నునియ, విశ్వవిద్యాలయం లోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు,రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

## దేవతలకు వ్రతచర పరిచయలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదురోజుల పాటు నిర్వహించే 'పవిత్రోత్సవాల్లో' భాగంగా గురువారం స్వామి అమ్మవార్లతో పాటు పరివార దేవతలకు 'వ్రతచర పరిచయలు' నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు పవిత్రోత్సవ కార్యక్రమాల్లో నిమగ్నమ య్యాయి. ఈ సందర్భంగా ఆలయంలోని ఈశాన్యమూల వెలసిన యాగశాలలో ప్రత్యేక అలంకారాలు జరిపారు. ప్రధాన అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్ పర్యవేక్షణలో అర్చకు లు, దండనాధికారి వెంటరాగా శాస్త్రోక్తంగా పవిత్రాలతో పాటు పూజా సామగ్రిని ఊరేగించారు. ఆలయంలోని ఆకాశ వినాయ కుడు, చెంగల్వరాయస్వామి,సూర్యభగవానుడు,స్వామి అమ్మవార్ల మూల విరాట్టులకు పట్టు పవిత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో స్థానాచార్యులు డాక్టర్ స్వామినాధన్, దండనాధికారి ఎస్ఎంకె పరశురామ గురుకుల్ (అచ్చితా గురుకుల్),ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్స్ సారధ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.ఆలయం తరపున ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, నాగభూషణం యాదవ్‌లు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఆదిదంపతుల బిక్షాటన



కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా గురువారం జరిగిన స్వామివారి తిరు కళ్యాణం సందర్భంగా ఆది దంపతులైన శివపార్వతులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన సాగించారు. తమ కుమారుడైన గణనాధుని తిరు కళ్యాణంకు కావలసిన ధన, కనక,వస్తు సామాగ్రిని సమకూర్చుకోవడానికి తల్లిదండ్రులైన శివపార్వతు లిద్దరూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన చేయడం ఆనవాయితీ. వినాయకుని కళ్యాణానికి కావలసిన ధన, కనక, వస్తువులను అందించాలని కోరుతూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన సాగించారు. ఈమేరకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, మాజీ ఛైర్మన్‌లు మోహన్‌రెడ్డి, జగన్నాధరెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ అధికారులు, ఉభయదారులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన చేశారు. ఈసందర్భంగా భక్తులు తమవంతు విరాళాలను స్వామివారి కళ్యాణానికి అందించారు.

**7 చంద్రగ్రహణంతో కాణిపాకం ఆలయం మూసివేత :**

చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 7న కాణిపాకం ఆలయాన్ని మూసవేస్తున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈనెల 7న రాత్రి 9.57 గంటల నుండి అర్ధరాత్రి 1.26 గంటల వరకు చంద్రగ్రహణ సంభవిస్తున్నందున మూసివేస్తున్నట్లు తెలిపారు. తదుపరి సోమవారం ఉదయం 4 గంటలకు ఆలయశుద్ధి, పుణ్యాహవాచనం, గ్రహణశాంతి, అభిషేకం నిర్వహించిన అనంతరం దుంయ 6 గంటల నుండి భక్తులు సర్వదర్శనం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు,

## గణనాధునికి టీటీడీ తరపున పట్టువస్త్రాల సమర్పణ



కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా గురువారం జరిగిన స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత స్వామివార్లకు టీటీడీ తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు టీటీడీ ఛైర్మన్ బిఆర్. నాయుడు దంపతులు, అర్చకులు వేదపండితులు కాణిపాకం చేరుకుని పట్టువస్త్రాలను స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో టీటీడీ,కాణిపాకం ఆలయ అధికారులు, అర్చకులు వేపండితులు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లోగా 43వేల గృహాలకు సోలార్ విద్యుత్ : ప్రభుత్వ విప్

కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: నియోజకవర్గంలో డిసెంబర్ నెలాఖరులోగా 43వేల గృహాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించేలా రెస్కో పాలకవర్గం పనిచేయాలని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం రెస్కో పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రస ంగించారు. పదవులు వచ్చినవారు, రానివారు కూడా పార్టీలో ఎంతో ముఖ్యమన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి అవకాశాలు వస్తుంటాయని ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. సిఎం చంద్రబాబునాయుడు స్వయంగా పదవులు కేటాయిస్తున్నారన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన రోజు కృష్ణాజలాలు వచ్చాయని, రెస్కో పాలకవర్గ ప్రమాణస్వీకారం నాడు ప్రభుత్వం రెస్కో లైసెన్స్ రెన్యువల్ చేయడం శుభసూచకమన్నారు.

## ప్రజా రక్షణకు మినీ ఫాల్కన్ వాహనం ప్రారంభించిన ఎస్పీ

చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ప్రజా రక్షణను దృష్టిలో వుంచుకుని చిత్తూరు జిల్లా పోలీసుశాఖ మినీ ఫాల్కన్ వాహనం సిద్ధం చేసింది. ఈ మినీ ఫాల్కన్ వాహనంను గురువారం ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా సాయుధదళ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పోలీసుశాఖ ఈ రోజు మినీ ఫాల్కన్ వాహనంను ప్రారంభించిందని, సాధారణంగా తమ వద్ద వున్న ఫాల్కన్ వాహనంను బ్రహ్మోత్సవాలు, లా అండ్ అర్డర్ సమస్యలు, పెద్ద పెద్ద బందోబస్తులు వున్న సమయాల్లో వినియోగి స్తుంటామన్నారు. ఆ వాహనం బస్సు సైజులో వుండటం వల్ల చిన్న ఊర్లు, వీధులు, పల్లెలు వంటి ప్రదేశాల్లో తీసుకెళ్లడం కష్టంగా వుంటుందన్నారు. చిత్తూరు జిల్లాలోని చిన్న ఊర్లు, పల్లెల్లో ర్యాలీలు, ధర్నాలు, పండుగలు ముఖ్యంగా జాతరలు ఘనంగా నిర్వహిస్తుంటారని, ఇలాంటి సందర్భాల్లో పోలీసులు ఉపయోగించడానికి ఒక వినూత్న పరిష్కారంగా ఈ మినీ ఫాల్కన్ వాహనంను రూపొందించడం జరిగిందన్నారు. ఈ వాహనంలో 360 డిగ్రీల కోణంలో తిరిగే అత్యాధునిక పిటిజెడ్ కెమెరా అమర్చబడి వుంటుందన్నారు. అదనంగా రెండు ప్రక్కల, వెనుక భాగంలో ఫిక్స్‌డ్ పాయింట్ కెమెరాలు అమర్చబడ్డాయన్నారు. దీనివల్ల మొత్తం పరసరాలు కవర్ చేయబడు తాయన్నారు. ఈ మినీ ఫాల్కన్ వాహనం రూపొందించడానికి సహకరించిన ఎంఎంఎసిటిఎస్ సంస్థ ఛైర్మన్ జి.దశరధ్‌రెడ్డికి ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ జి.దశరధ్‌రెడ్డిని ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఎఎస్పీ శివానందకిషోర్, చిత్తూరు డిఎస్పీ టి.సాయినాధ్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణా, మహబూబ్‌భాషా, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టు టౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ సూర్యనారాయణ, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్‌లు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.